క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

గన్నవరం: మండలంలోని 12 గ్రామ సచివాలయాల్లో ఈ మంగళవారం నుంచి 27వ తేదీ వరకు ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఈ.సత్యకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్యాంపులు షెడ్యూల్ ప్రకారం ప్రతిరోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ నెల 23, 24వ తేదీల్లో సూరంపల్లి-1, సవరగూడెం, బుద్దవరం-1, గన్నవరం సబ్‌ట్రెజరి, పురుషోత్తపట్నం గ్రామ సచివాలయాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 23 నుంచి 27 వరకు చిన్నఆవుటపల్లి, ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు ముస్తాబాద-1, కేసరపల్లి-1, బుద్దవరం-2, కొండపావులూరు, గన్నవరం-1, తెంపల్లి గ్రామ సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు జరుగుతాయని వివరించారు. ఈ అవకాశాన్ని మండలంలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కరాటే పోటీల్లో బంగారు పతకాలు



పెనమలూరు: హైదరాబాద్‌లో ఈ నెల 21వ తేదీన జరిగిన అంతర్జాతీయ ఓపెన్ కుంగ్‌ఫూ, కరాటే ఆల్‌స్టైల్స్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో యనమలకుదురుకు చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించారు. యనమలకుదురుకు చెందిన కరాటే మాష్టారు ఎస్.దుర్గారావు జోసెఫ్ సీనియర్ సిటిజన్ విభాగంలో బ్లాక్ బెల్టు కాటా, వెపన్‌కాటా విభాగంలో రెండు బంగారు పతకాలు గెలిచారు. 9 సంవత్సరాల విభాగంలో కలర్ బెల్టు కాటా విభాగంలో సోరంపూడి చేతన్‌దీపక్, సోరంపూడి డేవిడ్‌రాజు, సోరంపూడి డేవిడ్‌ప్రకాష్ బంగారు పతకాలు సాధించారు. వీరిని పలువురు అభినందించారు.

ఎస్పీని కలిసిన పెనమలూరు ఎమ్మెల్యే



కోనేరుసెంటర్: జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావును పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా బాధ్యతలు తీసుకున్న ఎస్పీని అభినందిస్తూ స్వీట్లు అందజేశారు. అనంతరం శాంతిభద్రతల అంశంపై కాసేపు చర్చించారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తకు పరామర్శ



పెనమలూరు: టీడీపీ మూకల దాడిలో గాయపడిన వైఎస్సార్ సీపీ కార్యకర్త షేక్ మోహిద్దీన్‌ను కమ్మ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవభక్తుని చక్రవర్తి సోమవారం పరామర్శించారు. గత ఎన్నికల ఫలితాల తరువాత టీడీపీ నేతలు వైఎస్సార్ సీపీ కార్యకర్తతో పాటు ఆయన ఇంటిపై దాడి చేశారు. దీంతో చక్రవర్తి పరామర్శించి అండగా ఉంటానని తెలిపారు. దాడులకు ఎవరూ భయపడరని అన్నారు.

విద్యార్థినికి నగదు బహుమతి అందజేత



ఉంగుటూరు: విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని గురుకుల పాఠశాల జూనియర్ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ మున్నంగి ఇమ్మానుయేలు అన్నారు. ఉంగుటూరు జెడ్పీ హైస్కూల్లో 2023-24 విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఎస్సీ కేటగిరిలలో అత్యధిక మార్కులు సాధించిన గోగులమూడి అన్వితకు ఎలుకపాడుకు చెందిన మున్నంగి ఏసోబు 28వ వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం కుమారుడు విశ్రాంత ప్రిన్సిపాల్ ఇమ్మానుయేలు, శాంతకుమారి నగదు బహుమతిగా రూ.5 వేలను సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కాటూరి వరప్రసాద్, హెచ్‌ఎం సీహెచ్.అనిత, ఉపాధ్యాయులు అమ్మన్న, అనంతయ్య విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో నష్ట నివారణ

ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి



పునాదిపాడులో ముంపు నివారణ చర్యలు వివరిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి

కంకిపాడు: సస్యరక్షణ చర్యలతో పంట నష్టం నివారించుకోవచ్చని ఉయ్యూరు చెరకు పరిశోధనాస్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి సూచించారు. మండలంలోని కంకిపాడు, పునాదిపాడు, కోలవెన్ను గ్రామాల్లో వ్యవసాయశాఖ అధికారులతో కలిసి సోమవారం విస్తృతంగా పర్యటించారు. ముంపు బారిన పడ్డ వరి పొలాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ నారుమడిలో విత్తనం చల్లిన 2-3 రోజుల వయస్సులో, మూడు రోజులు కన్నా ఎక్కువ రోజులు నీటిలో మునిగితే మొలక శాతం గణనీయంగా తగ్గుతుందన్నారు. నారుమడిలో నిలిచిన నీటిని సాధ్యమైన త్వరగా తొలగించాలన్నారు. ముంపును తట్టుకునే భీమ రకం విత్తనం విత్తిన 10 రోజుల వరకూ ముంపును తట్టుకుంటుందన్నారు.

మునిగిన వరి నారుమడిలో ఐదు రోజుల్లో నీటిని తొలగించుకోవాలన్నారు. 5 సెంట్ల నారుమడికి కిలో యూరియా, కిలో పొటాష్ వేసుకోవాలన్నారు. ఒక గ్రాము కార్బండిజమ్/2 గ్రాములు కార్బండిజమ్, మాంకోజెబ్‌తో కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. పిలకల దశలో ఉన్న సాధారణ రకాల్లో ఐదురోజులు వరకూ నారు బతికే ఉంటుందన్నారు. ముంపును తట్టుకునే ఎంటీయూ 1140, 1172, 1223, 1064, పీఎల్‌ఏ 1100 రకాలు వారం రోజుల వరకూ ముంపును తట్టుకుంటాయన్నారు. యాజమాన్య చర్యలపై దృష్టి సారించి పంటను కాపాడుకోవటం ద్వారా దిగుబడులు నష్టపోకుండా ఉంటారన్నారు. పరిశీలనలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓ పద్మజ, మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉయ్యూరు: మేలైన యాజమాన్య పద్ధతులు పాటించటం ద్వారా నష్టాన్ని అధిగమించొచ్చని ఉయ్యూరు చెరకు పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి అన్నారు. మండలంలోని వీరవల్లి మొఖాసా, చిన ఓగిరాల గ్రామాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను సోమవారం పరిశీలించారు. సుధారాణి మాట్లాడుతూ అల్పపీడనం వల్ల వివిధ దశల్లో ఉన్న పంట ముంపునకు గురైందన్నారు. పొలాల్లో మురుగు నిలవ ఉండకుండా తొలగించుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శ్రీనివాసరావు, ఏఓలు పద్మజ, గణేష్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు

కంకిపాడు: ముంపు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఎం.రామకృష్ణ ఆదేశించారు. మండలంలోని దావులూరు టోల్‌గేట్ పరిసరాల్లో జాతీయ రహదారికి ఆనుకుని ముంపునకు గురైన వరి పొలాలను అధికారుల బృందం సోమవారం పరిశీలించింది. జాతీయ రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్ నుంచి పూర్తి స్థాయిలో మురుగు పారుదల కాకపోవటంతో పంట పొలాలు ముంపునకు గురవుతున్నాయని రైతులు వివరించారు. తహసీల్దార్ రామకృష్ణ స్పందిస్తూ పొలాల్లో ఉన్న మురుగు బోదెల్లోకి మళ్లే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని, ముంపు సమస్య శాశ్వత పరిష్కారానికి ఉన్న మార్గాలను చూసి చర్యలు చేపట్టాలని సూచించారు. డ్రెయినేజీ, రెవెన్యూ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పంట చేలల్లో వర్షం నీరు తరలించాలి

గన్నవరం రూరల్: ఇటీవల వర్షాలకు ఎక్కువగా నీరు నిల్వ ఉన్న పొలాల్లో రెండు మీటర్లకు ఒక కాలిబాట తీసి నీరు బయటకు వెళ్లేలా చూడాలని మండల వ్యవసాయాధికారి ఎన్ఎల్ తేజశ్వి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ 14 రోజులు పైబడిన నారుమడులు మూడు రోజుల వరకూ నీటి ముట్టాన్ని తట్టుకుంటాయని చెప్పారు. అధికంగా నీరు నిల్వ ఉన్న వరి పొలాల్లో ఒక కేజీ యూరియా, ఒక కేజీ ఎంవోపీ ప్రతి 5 సెంట్ల నారుమడికి పిచికారీ చేయాలన్నారు. తెగుళ్లు సోకకుండా ఒక గ్రాము కార్బండిజం ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని వివరించారు. నాట్లు వేసిన వరి పొలాల్లో బూస్టర్ డోస్‌గా 20 కేజీల యూరియా, 15 కేజీల ఎంవోపీ పొలం అంతా సమపాళ్లలో వెదజల్లుకోవాలని రైతులకు సూచించారు.

మూలన పడిన అత్యవసర వాహనం

అధికారులు స్పందించాలని ప్రజల వినతి



నున్నలో మూలనపడిన 108 వాహనం

నున్న(విజయవాడరూరల్): అత్యవసర సమయంలో ఆపదలో ఉన్నవారిని ఆదుకునే 108 అంబులెన్స్ వాహనం మూలన పడింది. నున్న గ్రామం కేంద్రంగా నున్న, పాతపాడు, విలేజీ కండ్రిక, వెంకటాపురం, అడవినెక్కలం, సూరంపల్లి, పరిసర గ్రామాల్లోని ప్రజానీకానికి ప్రమాదాలు జరిగిన సందర్భంలో ఆకస్మికంగా గుండె నొప్పి, గర్భిణులను డెలివరీ నిమిత్తం ఆసుపత్రులకు తీసుకెళ్లడంలో ఎంతో ఉపయోగకరంగ ఉండే ఈ వాహనం ప్రజలకు అందుబాటులో లేదు. వాహనంలో సాంకేతిక పరంగా సమస్యలు తలెత్తి ముందుకు అడుగు కూడా వేయలేని పరిస్థితిలో ఉంది. ఈ విషయాన్ని అంబులెన్స్ డ్రైవర్లు ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదు. ఉన్నతాధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితిలో ఉన్నారు. వాహనంలో పనిచేయాల్సిన అవుట్ సోర్సింగ్ సిబ్బంది ఇద్దరు టెక్నీషియన్లు, ఇద్దరు డ్రైవర్లు కూడా నున్న గ్రామంలో ఉండటంలేదు. వారి సేవలను వేరే ప్రాంతాల్లో వినియోగించుకుంటున్నారు. దీనిని బట్టి నున్న పరిసర గ్రామాల ప్రజలకు 108 సేవలు ఆగిపోయినట్లేనని అనుకుంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకొని 108 ఎమర్జెన్సీ సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

చెరువును తలపిస్తున్న కార్యాలయ ఆవరణ



కంకిపాడు మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో నిలిచిపోయిన వర్షపు నీరు

కంకిపాడు: అది మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయం. అనేక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఇక్కడికి వస్తుంటారు. ఆయా శాఖల్లో పనుల కోసం మండలంలోని వివిధ గ్రామాల ప్రజలూ వస్తుంటారు. అలాంటి ప్రధానమైన కార్యాలయ ప్రాంగణం పల్లంగా ఉండటంతో చెరువును తలపిస్తోంది. చిన్నపాటి వర్షానికే నీరు నిలిచిపోయి రోజుల తరబడి కదలటం లేదు. దుర్గంధంతో అందరూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల పరిషత్ కార్యాలయానికి వచ్చే అధికారులు, ప్రజల వాహనాల పార్కింగ్ కోసం కొంత స్థలాన్ని కేటాయించారు. ప్రస్తుత మండల పరిషత్ పాలకవర్గం మండల పరిషత్, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ రాకపోకలకు వీలుగా సిమెంటు రహదారులను నిర్మించింది. ఖాళీగా ఉన్న ప్రాంగణాన్ని రబ్బిష్, కంకరు డస్ట్‌తో మెరక చేసింది. అయితే వర్షం పడితే మురుగుపోయేందుకు సరైన డ్రెయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేయలేదు. దీంతో చిన్నపాటి వర్షం కురిసినా ఎక్కడి వర్షం నీరు అక్కడే నిలిచిపోతోంది. ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు కార్యాలయ ప్రాంగణం చెరువులా మారింది. పార్కింగ్ సదుపాయం లేక ప్రజలు రోడ్ల మీదే వాహనాలను నిలుపుతున్నారు. దీనికి తోడు వర్షం నీరు రోజుల తరబడి కదలక దోమల ఉత్పత్తి కేంద్రంగా మారింది. మురుగు, తీవ్ర దుర్గంధం వెలువడుతోంది. వర్షాకాలం దోమలు, దుర్గంధం కారణంగా ప్రజారోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉంది. వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తమై తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

పారిశుద్ధ్య పనులకు మళ్లీ టెండర్లు పిలిచేందుకు తీర్మానం

రామవరప్పాడు: గ్రామంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణకు మళ్లీ టెండర్లు ఆహ్వానించాలని పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు పంచాయతీ కార్యాలయంలో సోమవారం సర్పంచి వరి శ్రీదేవి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలోని పలు అంశాలను పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు సభ్యులకు వివరించారు. ఈ సమావేశంలో 2024-25 సంవత్సరానికి పారిశుద్ధ్య పనుల నిర్వహణకు టెండర్లు వేసిన వేమినేని కిషోర్, తుమ్మల రమేష్‌లను పాలకవర్గ సభ్యులు అభ్యంతరం చెబుతూ వ్యతిరేకించారు. గ్రామానికి చెందిన వేమినేని కిషోర్, తుమ్మల రమేష్ ఇప్పటికే పంచాయతీలో పారిశుద్ధ్య సూపర్‌వైజర్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వీరికెలా టెండర్లు కట్టబెడతారని ప్రశ్నించారు. పారిశుద్ధ్యం నిర్వహణలో ఇప్పటికే వీరి పనితీరుపై విమర్శలు వస్తున్నాయన్నారు. వీరికి కాకుండా కొత్తవారి నుంచి టెండర్లు ఆహ్వానించాలని పాలకవర్గ సభ్యులు డిమాండ్ చేశారు. దీంతో ఓటింగ్ పెట్టడంతో మెజారిటీ సభ్యులు కొత్త వారి నుంచి మరలా టెండర్లు ఆహ్వానించాలని ఓటు ద్వారా కోరారు. టెండర్లకు ఆహ్వానించే ముందు జనాదరణ ఉన్న పత్రికలో ప్రకటన ఇవ్వాలని పలువురు సమావేశంలో ప్రస్తావించారు. అనంతరం పలువురు వార్డు సభ్యులు మాట్లాడుతూ సమస్యాత్మకంగా మారిన ప్రాంతాల్లో రహదారులు, డ్రెయిన్లు అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వకుండా స్వలాభం కోసం అభివృద్ధి పనులు ఏలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. అనంతరం జమాఖర్చుల వివరాలు, కాలువలపై ఫెన్సింగ్ ఏర్పాటు, తాగునీటి బోర్ల ఏర్పాటు, వంటి అంశాలను పాలకవర్గ సభ్యులు ఏక గ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు మెండె సుధాకర్, కొంగన రవి, లక్ష్మి, అప్పారావు, రమాదేవి, అద్దేపల్లి సాంబశివనాగరాజు, రేగళ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

వణుకూరులో పేకాట జోరు

పెనమలూరు: వణుకూరు గ్రామంలో పేకాట జోరుగా సాగుతోంది. గ్రామ శివారులో ఇద్దరు వ్యక్తులు పేకాట నిర్వహిస్తున్నారని గ్రామస్తులు తెలుపుతున్నారు. గత కొద్ది రోజుల వరకు జన చైతన్య ప్లాట్‌లలో పేకాట ఆడించారు. ఇప్పుడు జగనన్న కాలనీ లేఅవుట్ రెండులో ఒక ఇంట్లో పేకాట ఆడిస్తున్నా పోలీసులు చర్యలు తీసుకోవటం లేదు. గ్రామంలో గత నెల రోజులుగా బాహాటంగా పేకాట నిర్వహిస్తున్నా పోలీసుల నిఘా వ్యవస్థ ఏమయిందని గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీ అండదండలతో పేకాట నిర్వహిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు స్పందించి పేకాటరాయుళ్లను అదుపు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆసరా సంస్థ నూతన కమిటీ సభ్యుడిగా నాగరాజు



నాగరాజుకు నియామక పత్రం అందజేస్తున్న శత్రుఘ్నుడు

పెనమలూరు: ఉమ్మడి కృష్ణా జిల్లా వినియోగదారుల హక్కుల చట్టం పరిరక్షణ ఆసరా సంస్థ నూతన కమిటీ కార్యవర్గ సభ్యుడిగా వరుడు నాగరాజును నియమించారు. ఈ మేరకు ఆయన సోమవారం వివరాలు తెలుపుతూ వినియోగదారుల పరిరక్షణ ఆసరా సంస్థ గత 8 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా పని చేస్తుందన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాకు నూతన కమిటీని వేయగా అందులో తనను కార్యవర్గ సభ్యుడిగా నియమించారన్నారు. వినియోగదారుల పరిరక్షణ, హక్కులు పరిరక్షణకు తానుపని చేస్తానన్నారు. తనకు అవకాశం కల్పించిన వ్యవస్థాపక అధ్యక్షుడు హబీబ్ సుల్తాన్‌అలీ, ఏపీ కార్యవర్గ సభ్యుడు శత్రుఘ్నుడికి కృతజ్ఞతలు తెలిపారు.

అభివృద్ధిని అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలకు వినతి



పెనమలూరు: పెనమలూరు గ్రామంలో అభివృద్ధిని అడ్డుకుంటున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని పెనమలూరు సర్పంచి లింగాల భాస్కరరావుతో తోపాటు గ్రామ పెద్దలు జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు సోమవారం మచిలీపట్నం వెళ్లి ఫిర్యాదును కలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఫిర్యాదు చేసిన వారు వివరాలు తెలుపుతూ.. గ్రామానికి చెందిన బద్రీనారాయణ గ్రామంలో జరిగే ప్రతి అభివృద్ధి పనులపై ఫిర్యాదు చేస్తూ అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. గ్రామంలో రోడ్లు, సచివాలయాల భవనాలు, డ్రెయిన్లు నిర్మాణం చేసినా వాటిపై తప్పుడు ఆరోపణలో పిటీషన్ పెట్టి అధికారులను ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. గ్రామంలో శ్మశానవాటిక గ్రామస్తుల సహకారంతో అభివృద్ధి చేస్తుంటే దానిని కూడా వదలకుండా పిటీషన్లు పెడుతున్నారని తెలిపారు. కలెక్టర్ తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారన్నారు. గ్రామ పెద్దలు కిలారు బ్రహ్మాజీ, తాతినేని కోటేశ్వరరావు, కిలారు ఉమారాణి, కోయ శ్రీహరిరావు పలువురు ఉన్నారు.

షిర్డీ సాయిబాబాకు విశేష పూజలు



షిర్డీ సాయిబాబా దేవస్థానంలో పూజలు చేస్తున్న భక్తులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని షిర్డీ సాయిబాబా దేవస్థానంలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని సోమవారం విశేష పూజలు నిర్వహించారు. సాయిబాబాకు తొమ్మిది రకాల పండ్లరసాలతో అభిషేకం, పంచామృత అభిషేకం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో అమ్మవారికి శాకంబరి అలంకరణ చేసి, కుంకుమార్చన నిర్వహించారు. తేలప్రోలు భజన సమాజం ఆధ్వర్యంలో షిర్డీ సాయి గానామృతం జరిగింది. ఆలయ ప్రాంగణంలో మధ్యాహ్నం 2 వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, తవ్వా ఆదిలక్ష్మి, గుత్తా నాగమణి, లంక బేబీ సరోజిని పాల్గొన్నారు.

సామాజిక అసమానతలు సరిచేయాలి

సోషల్ జస్టిస్ ఫోరం చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్



మాట్లాడుతున్న చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో రిజర్వేషన్లలో జరుగుతున్న సామాజిక అన్యాయం, అసమానతలను సరిచేయాలని సోషల్ జస్టిస్ ఫోరం రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల రిజర్వేషన్ల అమల్లో ఆయా వర్గాలకు తీరని అన్యాయం జరుగుతోందన్నారు. కొన్ని సామాజికవర్గాల వారు అత్యధిక ప్రయోజనాలను పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ సామాజిక అసమానతలను సత్వరమే సరిచేసి అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. ప్రభుత్వం ప్రజలకు తల్లిదండ్రుల మాదిరి వ్యవహరించాలన్నారు. సమగ్ర కులగణన - జనగణన ద్వారా అన్ని సామాజిక వర్గాల వారికి వారి జనాభాకు అనుగుణంగా ఎవరెంతో వారికంత అనే సూత్రాన్ని అనుసరించి విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించాలన్నారు. కాపుల వలన బీసీలకు ఇబ్బందులు లేకుండా ఏబీసీడీ వర్గీకరణ చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిజర్వేషన్ వర్గాలకు ఇబ్బందులు కలగకుండా సమన్యాయం చేయాలని కోరారు. ఈ విషయంలో ప్రధాని, రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలన్నారు. ఈ సమావేశంలో సోషల్ జస్టిస్ ఫోరం నాయకులు రావి శ్రీనివాస్, చెవుల కృష్ణాంజనేయులు, కె.అయ్యప్ప, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక స్పృహతో విజయాలు



మాట్లాడుతున్న రావూరి సుబ్బారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు సామాజిక స్పృహ పెంపొందించుకుంటే మంచి విజయాలను అందుకుంటారని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి సుబ్బారావు (దత్త) అన్నారు. రోటరాక్ట్ క్లబ్ ఆఫ్ పీఎస్‌సీఎంఆర్ కాలేజ్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమం ఆ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించే లక్ష్యంతో రోటరీ క్లబ్ విద్యాసంస్థల్లో రోటరాక్ట్ క్లబ్‌ను నిర్వహిస్తుందని తెలిపారు. విద్యార్థి స్థాయిలో సామాజిక సేవల్లో భాగస్వాములయ్యే విద్యార్థులు రానున్న రోజుల్లో సమాజానికి మరింత మేలు చేసే దిశగా అడుగులు వేస్తారని చెప్పారు. కళాశాల కార్యదర్శి చిట్టా అమర్ సుధీర్, కోశాధికారి కాజా రాఘవయ్య మాట్లాడుతూ రోటరాక్ట్ క్లబ్ విశిష్టతను, వివిధ సేవ కార్యక్రమాల గురించి వివరించారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ఎల్లప్పుడూ సమాజ సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో, ప్రోత్సహించడంలో ముందుంటుందని చెప్పారు. నూతనంగా పదవీ బాధ్యతలు స్వీకరించిన రోటరాక్ట్ క్లబ్ సభ్యులకు అభినందనలు తెలిపారు. రోటరాక్ట్ క్లబ్ అధ్యక్షుడిగా అర్పిత్ భరద్వాజ్, కార్యదర్శిగా అచ్యుత, ఉపాధ్యక్షుడిగా శశాంక్ తదితరులు బాధ్యతలు స్వీకరించారు. రోటరీ సభ్యుడు ఎంపీ ప్రసాద్ ఇన్‌స్టలేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.పతంజలిశాస్త్రి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎస్.మణికంఠ, ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ పి.నరేష్, రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల నివారణపై అవగాహన

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): మినిస్ట్రీ ఆఫ్ సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్‌మెంట్‌లోని హెల్త్ కేర్ అండ్ సోషల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో పూర్ణానందంపేటలోని కొత్తా సుబ్బారావు పాఠశాలలో మత్తు పదార్థాల వినియోగంపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సంస్థ కౌన్సిలర్ అనిల్‌కుమార్ మత్తు పదార్థాల వినియోగం వల్ల జరిగే దుష్పరిణామాలు, విద్యార్థుల్లో కలిగే శారీరక, మానసిక సమస్యలను వివరించారు. ఎస్ఎన్‌పురం ఉమెన్ ఎస్ఐ సరళ మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని సూచించారు. హెచ్‌ఎం సంస్థ సభ్యులు ఎం.షబా, సుజాత, దివెన జ్యోతి పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దటమే లక్ష్యం



ప్రదర్శనను తిలకిస్తున్న డీఈవో సుబ్బారావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులను సమర్థవంతంగా తీర్చిదిద్దటమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా విద్యాశాఖాధికారి యువీ సుబ్బారావు అన్నారు. శిక్ష సప్తాహ్ కార్యక్రమం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని సీవీఆర్ హైస్కూల్ పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యా విధానం ప్రవేశ పెట్టి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా వారం రోజుల పాటు వార్షికోత్సవాన్ని నిర్వహిస్తుందని తెలిపారు. శిక్ష సప్తాహ్ పేరుతో వివిధ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో ఈ నెల 29వ తేదీ వరకూ ఈ కార్యక్రమాలు కొనసాగనున్నట్లు పేర్కొన్నారు.

అవగాహనతోనే సైబర్ నేరాల కట్టడి



సమావేశంలో మాట్లాడుతున్న పటమట సీఐ మోహనరెడ్డి

పటమట(విజయవాడతూర్పు): ఇటీవల కాలంలో సామాజిక మాధ్యమాల ద్వారా ఆన్‌లైన్ మోసాలు పెరిగాయని, వీటిపై యువత అప్రమత్తంగా ఉండాలని, ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టా, తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌లో యువత వ్యక్తిగత వివరాలు గోప్యంగా ఉంచుకోవాలని పటమట సీఐ మోహనరెడ్డి తెలిపారు. విజయవాడ పోలీసు కమిషనరేట్ సిబ్బంది, ఆదిత్య డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో సోమవారం పటమటలంకలోని కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పటమట సీఐ మోహనరెడ్డి విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్‌పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని చెప్పారు. అందులో భాగంగానే ఓటీపీ(ఒన్‌టైం పాస్‌వర్డ్) తరహా నేరాలు, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, గిఫ్ట్ ఓచర్లు వచ్చాయని, ఆన్‌లైన్‌లో పార్సిల్ ఆర్డర్ పెట్టారని అందులో డ్రగ్స్ ఉన్నాయని, గిఫ్ట్ లేదా కూపన్లు గెలుచుకున్నారని వాటిని క్లెయిమ్ చేసుకోవాలని అనేక తరహాల్లో మోసాలు పెరిగాయని పేర్కొన్నారు. ఇలాంటి వాటికి విద్యార్థులు, యువత అస్సలు స్పందించవద్దని సూచించారు. సైబర్ నేరాలు అవగాహనతోనే నిర్మూలన చేయవచ్చని, వీటిపై సరైన అవగాహన లేకపోతే బాధితులుగా మిగిలిపోతారని తెలిపారు. సైబర్ మోసాల పట్ల అవగాహన కలిగి ఉండి తల్లిదండ్రులు, స్నేహితులు, బంధువులను చైతన్యవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ వీర్రాజు, పటమట పోలీస్ స్టేషన్ ఎస్ఐ శాతకర్ణి, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

కంకిపాడు: యువతి అదృశ్యమైన సంఘటనపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం రాత్రి కేసు నమోదైంది. ఎస్ఐ డి.సందీప్ తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రమైన కంకిపాడుకు చెందిన యువతి (21) డిగ్రీ వరకూ విద్యనభ్యసించి ఇంటి వద్దే ఉంటోంది. ఈనెల 19న అంకమ్మ తల్లి గుడికి వెళ్లి వస్తానని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీనిపై యువతి మామ్మ శివలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సందీప్ తెలిపారు.

ప్రత్యేక పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ పార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వరస్వామివారి దేవస్థానంలో సోమవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో ఉదయం 6 గంటలకు రుద్రాభిషేకం, అనంతరం ఏకాదశ రుద్రాభిషేకం చేశారు. స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులకు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారిని దర్శించుకోని పూజలు నిర్వహించారు. భక్తులను ఉచిత తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సాయంత్రం 6 గంటలకు భజన కార్యక్రమం చేశారు.